# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-10-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ప్రత్యేక స్థానం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2. డోలీ మోతల బాధలు తీర్చడమే లక్ష్యంగా గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కళ్యాణ్ తెలిపారు.**

**3. నేటి నుంచి విజయవాడ ఉత్సవ్ ప్రారంభం కానుందని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు.**

**4. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మూడో మ్యాచ్ ఈరోజు జరుగుతుంది.**

=========================

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ప్రత్యేక స్థానం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తుండటంపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విజయవాడ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణానది, ప్రసిద్ధ కనకదుర్గమ్మ ఆలయం నగరానికి గొప్ప వారసత్వాన్ని అందించాయని తెలిపారు. ప్రజలు తమ సంప్రదాయాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, వాటిని భావితరాలకు అందించినప్పుడే నగర సంస్కృతి సజీవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో, నగరాలు తమ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కాపాడుకుంటూ అభివృద్ధి చెందడం ముఖ్యమని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

-------------------------

ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, స్థానిక చిరు వ్యాపారులకు ఆర్థికంగా మేలు జరిగేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సుమారు 45 నిమిషాల పాటు స్థానిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ సాయంత్రం ప్రారంభమయ్యే విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడు ముఖ్య

అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని కేశినేని శివనాథ్ తెలియజేస్తూ..

వాయిస్..25 సెకన్లు

---

డోలీ మోతల బాధలు తీర్చడమే లక్ష్యంగా గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. రాకోట గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి, అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. గిరిజన ప్రాంతాలపై తనకు ప్రత్యేక మక్కువ ఉందని, గిరిజనులు ప్రకృతిని, సంస్కృతిని కాపాడుతున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

---

శాసనపల్లి-పెదవేమిలి గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు 6 కోట్ల 12 లక్షల రూపాయలతో ఎత్తైన వంతెనను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా జామి మండలంలో వంతెన నిర్మాణానికి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు వంతెన కోసం ఎదురుచూస్తున్నారని, వంతెన పూర్తయితే విద్యార్థులు, రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు విజయనగరం పట్టణానికి ప్రయాణం సులభతరమవుతుందని పేర్కొన్నారు.

---

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవాతో దేశ సేవా' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 'వేప పూత పూసిన యూరియా' గురించి ఈరోజు తెలుసుకుందాం.

2015 సెప్టెంబర్‌లో దేశంలో ఉత్పత్తి చేసే యూరియా మొత్తానికి వేప పూత తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే ఏడాది డిసెంబర్‌లో దిగుమతి చేసుకునే యూరియాకూ ఈ నిబంధనను విస్తరించింది. గతంలో రైతులకు తక్కువ ధరకు అందించే యూరియాను కొందరు పారిశ్రామిక అవసరాలకు మళ్లించేవారు. దీంతో ప్రభుత్వ సబ్సిడీ ద్వారా లబ్ధి పొందాల్సిన రైతులకు యూరియా కొరత ఏర్పడేది. ఈ అక్రమ మళ్లింపును అరికట్టేందుకు యూరియా గింజలకు వేప పూత వేయడం ప్రారంభించారు. వేప పూత వల్ల యూరియాలోని నత్రజని నెమ్మదిగా విడుదలవుతుంది. దీంతో మొక్కలు దాన్ని మరింత సమర్థంగా గ్రహించగలుగుతాయి. మరో వైపు, పారిశ్రామిక అవసరాలకు యూరియాను మళ్లించడం కూడా ప్రయోజనకరం కాకుండా మారింది. ఈ విధానంతో యూరియా అక్రమ మళ్లింపు దాదాపు కనుమరుగైందని అంచనా. వేప పూత యూరియా సంస్కరణ ద్వారా బ్లాక్ మార్కెట్ అరికట్టినట్లు, తద్వారా దేశంలోని ప్రతి రైతుకు అవసరమైన సమయంలో యూరియా కొరత లేకుండా లభ్యమవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివరిస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు టీ20 సిరీస్‌లో భాగంగా మూడో టీ20 మ్యాచ్ ఈరోజు ప్రారంభం కానుంది. ఇండోర్‌లోని హోల్కర్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో భారత్, వెస్టిండీస్ చెరో మ్యాచ్ గెలిచాయి. ఈ రాత్రికి జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుంది.

---------------------------

నెల్లూరు నగరంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ను అందిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని సర్వేపల్లి కాల్వ కట్టపై 60 లక్షల రూపాయలతో చేపట్టనున్న సి.సి రోడ్ల నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పౌరులు, ప్రముఖుల నుంచి అందే జ్ఞాపికలు, కానుకల విక్రయానికి సంబంధించి 'పీఎం మెమెంటోస్' ఎనిమిదో విడత ఆన్‌లైన్ వేలం గడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆసక్తి గల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ఆన్‌లైన్ వేలం ప్రక్రియలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న దాదాపు 30 రకాల కానుకలు, జ్ఞాపికలు కొనుగోలుదారుల కోసం అందుబాటులో ఉంచారు.

---------------------------

దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో తొలి విడతగా 52 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలను ఎంపి సీఎం రమేష్ పంపిణీ చేశారు.

=====================